క్లుప్తంగా

రాష్ట్రస్థాయి జూడో పోటీలకు ఎంపిక



విజేతలుగా నిలిచిన విద్యార్థులు

నంద్యాల(న్యూటౌన్): రాష్ట్రస్థాయి జూడో పోటీలకు పాన్నాపురం జిల్లా పరిషత్ విద్యార్థులు ఎంపికైనట్లు పీఈటీ విశ్వనాథ్, హెచ్ఎం విజయ్య తెలిపారు. బుధవారం జూడో పోటీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాలలో అభినందించారు. ఈనెల 2వ తేదీన నంద్యాలలోని ఇండోర్ స్టేడియంలో జిల్లా స్థాయి సబ్ జూనియర్ జూడో ఎంపిక పోటీలు జరిగాయన్నారు. ఇందులో తమ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. బాలికల విభాగంలో వెన్నెల 36కేజీల విభాగం, కస్తూరి 52 కేజీల విభాగం, దివ్య 57కేజీల విభాగంలో గోల్డ్ మెడల్ సాధించినట్లు తెలిపారు. ఈనెల 10వ తేదీన మంగళగిరిలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో వారు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రేమ్‌కుమార్, సుదర్శన్‌రెడ్డి, శ్రీనివాసులు, సరోజ, రసూల్‌బీ, తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టుల సందర్శన

నంద్యాల(న్యూటౌన్): రాయలసీమలో మూడు రోజుల పర్యటనలో భాగంగా ముచ్చుమర్రి, ఎత్తిపోతల పథకం, పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్, బానకచర్ల క్రాస్ రెగ్యులేటర్, తెలుగు గంగ ప్రాజెక్టులను సందర్శించినట్లు రిటైర్డు ఐపీఎస్ అధికారి వెంకటేశ్వరరావు తెలిపారు. బుధవారం రైతు సంఘం నాయకుడు బొజ్జా దశరథరామిరెడ్డి స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. పోలవరం, బానకచర్ల ప్రాజెక్టులు కాంట్రాక్టర్ల ప్రయోజనాలకే తప్ప వాటి వల్ల రాయలసీమకు ఏమాత్రం లబ్ధిచేకూరదని విమర్శించారు. సమావేశంలో బొజ్జా దశరథరామిరెడ్డి, సాగునీటి రంగ విశ్లేషకులు లక్ష్మీనారాయణ, రైతు సేవా అధ్యక్షుడు భవానీప్రసాద్, జొన్నలగడ్డ రామారావు, సీపీఐ నాయకులు రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

స్క్రీనింగ్‌తో క్యాన్సర్‌ను జయించవచ్చు

గోస్పాడు: స్క్రీనింగ్‌తోనే క్యాన్సర్‌ను జయించవచ్చునని వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ, సూపరింటెండెంట్ డాక్టర్ మల్లేశ్వరితో పాటు ఎన్‌సీడీ ప్రోగ్రాం జిల్లా అధికారి కాంతరావునాయక్ అన్నారు. క్యాన్సర్ స్క్రీనింగ్ (ఎన్‌సీడీ) కార్యక్రమంపై ఒక రోజు శిక్షణా కార్యక్రమాన్ని నంద్యాల మెడికల్ కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 'క్యాన్సర్‌పై విజయం–స్క్రీనింగ్‌తో సాధ్యం' అనే నినాదంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో ఇప్పటికే ఎన్‌సీడీ 3.0 సర్వే ద్వారా ప్రజలకు పరీక్షలు నిర్వహించారని తెలిపారు. 30 ఏళ్ల వయస్సు దాటిన ప్రతి ఒక్కరికి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు ఉచితంగా చేయనున్నట్లు తెలిపారు. అందులో భాగంగా జిల్లాలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా ఆసుపత్రులు, జిల్లా ఆసుపత్రుల్లో ఉండే గైనకాలజీ వైద్యులకు, దంత వైద్యులకు, ఎన్‌సీడీ సెల్ వైద్యులకు శిక్షణ నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం శిక్షణలో వైద్యులకు క్యాన్సర్ స్క్రీనింగ్ విధానంపై వివరించారు. కార్యక్రమంలో మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపాళ్లు, డాక్టర్లు కళావతి, రాజశేఖర్, విజయకుమారి, శాంతి, తదితరులు పాల్గొన్నారు.

మహానందీశ్వరుడిని దర్శించుకున్న ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్

మహానంది: ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ బంగార్రాజు బుధవారం మహానందీశ్వరుడిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ఇన్‌స్పెక్టర్ నాగమల్లయ్య స్వాగతం పలికారు. అనంతరం కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామివార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేశారు.

అలరించిన నృత్యప్రదర్శన



నృత్యప్రదర్శనలో కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్య కళావేదికపై రంగారెడ్డి జిల్లాకు చెందిన సుమేధ జ్యోషి వారి సంప్రదాయ నృత్యప్రదర్శన అలరించింది. వినాయకకౌత్వం, శివాష్టకం, శివపార్వతికల్యాణం, నమశ్శివాయతే, శివతాండవం, భోశంభో తదితర గీతాలకు శ్రీవిద్య, మేదస్వి, దీక్షిత, కుశాల, స్పందన, రక్ష, గీతిక, పూజిత, గ్రీష్మ, సుమేధ, సహస్ర, నిధి, అదిత్రి, స్నిగ్ధ తదితరులు నృత్యప్రదర్శన చేశారు.

మహానందిలో భక్తుల సందడి

మహానంది: శ్రావణమాసాన్ని పురస్కరించుకుని బుధవారం మహానందిలో భక్తుల సందడి నెలకొంది. పలు ప్రాంతాల నుంచి భక్తులు ఆలయానికి చేరుకుని కామేశ్వరీ సమేత మహానందీశ్వరస్వామివారిని దర్శించుకున్నారు. ఉదయం, సాయంత్రం కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామివార్లకు అష్టవిధ మహామంగళహారతులు చేపట్టారు. ఉదయం స్వామి, అమ్మవార్లకు నిత్యకల్యాణం జరిపించారు.






అధినేత వైఎస్ జగన్‌తో...

డోన్‌లో బుధవారం రాష్ట్ర ఆర్థిక శాఖ మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి కుమారుడి వివాహ రిసెప్షన్‌కు హాజరైన వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేస్తున్న నంద్యాల, ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యేలు శిల్పారవిచంద్ర కిశోర్‌రెడ్డి, గంగుల బిజేంద్రారెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, నంద్యాల మాజీ పార్లమెంట్ సభ్యుడు పోచాబ్రహ్మానందరెడ్డి

ఎస్‌ఐ కావలెను!

- దొర్నిపాడు పోలీస్ స్టేషన్‌కు పెద్ద దిక్కు కరువు
- గతేడాదిలో ముగ్గురు సబ్‌ఇన్‌స్పెక్టర్లు బదిలీ
- ఐదు వారాలుగా ఎస్‌ఐ లేకుండా స్టేషన్ నిర్వహణ



దొర్నిపాడు: ఫ్యాక్షన్ ప్రాంతం. 4 సమస్యాత్మక గ్రామాలున్నాయి. తరచుగా గొడవలు జరుగుతుంటాయి. దీనికితోడు కూటమి సర్కారు వచ్చిన తర్వాత వీధివీధినా బెల్టుషాపులు తెరుచుకున్నాయి. అసాంఘిక కార్యకలాపాలు నిత్యకృత్యమయ్యాయి. వీటిని కట్టడి చేస్తూ శాంతిభద్రతలను పరిరక్షించాల్సిన దొర్నిపాడు పోలీస్ స్టేషన్‌కు పెద్ద దిక్కు కరువయ్యారు. గత ఐదు వారాలుగా ఇక్కడ సబ్‌ఇన్‌స్పెక్టర్ లేరు. ఫ్యాక్షన్ ఏరియా కావడంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని మండల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలగక ముందే ఉన్నతాధికారులు స్పందించి స్టేషన్‌కు ఎస్‌ఐను నియమించాలని కోరుతున్నారు. 14 గ్రామాలు ఉన్న మండలంలో డబ్ల్యూ గోవిందిన్నె, డబ్ల్యూ కొత్త పల్లె, కిష్టిపాడు, చాకరాజు వేముల సమస్యాత్మక గ్రామాలు. ఆయా గ్రామాలపై ఎప్పుడూ పోలీసు నిఘా ఉండాలి. అయితే, ఇక్కడి స్టేషన్‌కు ఎస్‌ఐలు అలా వస్తున్నారు ఇలా వెళ్తున్నారు. ఏడాది కాలంలోనే ముగ్గురు ఎస్‌ఐలు బాధ్యతలు నిర్వహించి వెళ్లిపోయారు. ఎన్నికల సమయంలో ఇక్కడ విధులు నిర్వహిస్తున్న తిరుపాలు బదిలీపై వెళ్లడంతో 2024 ఫిబ్రవరి 28న ఎస్‌ఐగా సురేష్ బాధ్యతలు నిర్వహించారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రశాంతంగా జరిగేలా తన బాధ్యతలు నిర్వర్తించారు. అనంతరం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అయన్ను బదిలీ చేశారు. 2024 ఆగస్టు 21న ఎస్‌ఐగా వెంకటేష్ విధుల్లో చేరారు. ఈయన కొన్ని రోజులు అనంతరం సెలవుల్లో వెళ్లడంతో రెండు నెలలకు మరో ఎస్‌ఐ హనుమంతురెడ్డిని బదిలీ చేయడంతో 2025 ఫిబ్రవరి 13న బాధ్యలు స్వీకరించారు. ఈయన 25 రోజుల మాత్రమే విధులు నిర్వహించి మార్చి 9న రాత్రికి రాత్రే బదిలీ ఉత్తర్వులు రావడంతో రిలీవ్ అయ్యి వెళ్లిపోయారు. దీంతో నంద్యాల మూడో పట్టణ పోలీస్ స్టేషన్ నుంచి సత్యనారాయణను బదిలీపై పంపారు. ఈయన 90 రోజులు మాత్రమే ఉండి జూన్ 30న పదవీ విరమణ చేశారు. అప్పటి నుంచి దొర్నిపాడు స్టేషన్‌కు ఎస్‌ఐ లేక పోవడంతో ఉన్న పోలీసులు ఇబ్బందులు పడుతున్నారు. అంతేగాక చిన్న స్టేషన్ కావడంతో ఎవ్వరూ ఇక్కడికి రావడానికి సుముఖత చూపడం లేదని తెలుస్తుంది. నెల రోజులుగా ఏఎస్‌ఐ రంగయ్యనే స్టేషన్ వ్యవహారాలు చూస్తున్నారు.

ఆధ్యాత్మిక సంబరం



ప్రత్యేక అలంకరణలో వాసవీ మాత

వెలుగోడు: వాసవీ కన్యకా పరమేశ్వరి దేవి ఆలయ పునఃప్రతిష్ఠాపనోత్సవాల సందర్భంగా మూడు రోజులుగా పట్టణం ఆధ్యాత్మికతను సంతరించుకుంది. బుధవారం పెనుగొండ క్షేత్ర పీఠాధిపతులు ప్రజ్ఞానంద సరస్వతి చేత ఆధ్యాత్మిక ప్రవచన పునః ప్రతిష్ఠ చేశారు. ప్రాతఃకాల పూజ, క్షీర తర్పణాలు, యంత్రాభిషేకాలు, శిఖర కలశ ప్రతిష్ఠ, ధ్వజ ప్రతిష్ఠ, మూర్తి ప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠాపన, బలిదానం, పూర్ణాహుతి, కలశ ఉద్వాసన, మంగళ హారతి ఇచ్చారు. మధ్యాహ్నం వాసవి కమిటీ ఆధ్వర్యంలో వాసవీ రైస్ మిల్లు వద్ద అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రి టీజీ వెంకటేశ్, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షులు బింగుమళ్ల శ్యాంసుందర్, జిల్లా గౌరవ అధ్యక్షుడు భవనాసి మహేష్, మున్సిపల్ కార్పొరేటర్ ఖండే శ్యాంసుందర్ లాల్, జిల్లా మాజీ అధ్యక్షులు సత్యనారాయణ, నెరవాటి రవి, ఎంపీపీ లాలం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

● ఘాటెక్కిన పచ్చిమిర్చి



గోస్పాడు: పచ్చిమిర్చి ధరలు మండిపోతున్నాయి. కోసి తినకుండానే మంట పుట్టిస్తోంది. పక్షం రోజుల్లోనే దీని ధర రెట్టింపై కొండెక్కి కూర్చుంది. విపరీతంగా ధర పెరగడంతో వినియోగదారులు ఆచితూచి కొనుగోలు చేస్తున్నారు. గత కొద్ది రోజులుగా పెరుగుతూ వస్తున్న పచ్చిమిర్చి ధర నేడు రూ. 100-120 వరకు పలుకుతోంది. వర్షాలకు తోడు ప్రస్తుతం స్థానికంగా పచ్చిమిర్చి పంట ఆశించిన మేర లభ్యం కాకపోవడమే ధరలు పెరగడానికి ప్రధాన కారణమని తెలుస్తోంది. మిగతా కూరగాయలు కూడా ప్రస్తుతం అధిక ధరనే పలుకుతున్నాయి. దీంతో వినియోగదారులు కూరగాయలు కొనుగోలు చేయలేని పరిస్థితి నెలకొంది.

ఆల్బెండజోల్‌తో నులిపురుగుల నివారణ



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ

గోస్పాడు: పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేయించడం ద్వారా నులిపురుగులను నివారించవచ్చునని డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ అన్నారు. బుధవారం నంద్యాల పట్టణంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో జిల్లాలోని ప్రైవేట్ స్కూల్ యాజమాన్య సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ ఆగస్టు 12వ తేదీ జరగబోయే నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలన్నారు. భోజనం అనంతరం విద్యార్థులకు ఆల్బెండజోలు మాత్రలు మింగించాలన్నారు. దీని వల్ల రక్తహీనత నుంచి బయటపడుతారన్నారు. విద్యార్థులు మరుగుదొడ్లు ఉపయోగించిన తర్వాత ఆటలు ఆడిన తర్వాత చేతులను శుభ్రం పరచుకునేలా చూడాలని నంద్యాల జిల్లా ప్రైవేట్ స్కూల్ యాజమాన్యానికి సూచించారు. అనంతరం పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ కాంతారావు నాయక్, ప్రైవేట్ స్కూల్ యాజమాన్య కమిటీ నాయకులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రుద్రవరం: 1 నుంచి 19 ఏళ్ల వయస్సు వారికి ఈనెల 12న ఆల్బెండజోల్ మాత్రలు వేయాలని ఆలమూరు పీహెచ్‌సీ వైద్యాధికారులు అమర్నాథరెడ్డి, నాగశ్రీజరెడ్డి అన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు. ఏఎన్‌ఎంలు,అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బంది, ఆశా వర్కర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సాక్షి గణపతికి పూజలు



శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలో లోకకల్యాణార్థమై బుధవారం సాయంత్రం సాక్షి గణపతికి అభిషేకం, జ్వాలా వీరభద్రస్వామికి విశేషపూజలు నిర్వహించారు. సాక్షి గణపతికి పంచామృతాలతోను, ఫలోదకాలతోను, హరిద్రోదకం, గంధోదకం, పుష్పోదకం, కలశోధకం, శుద్ధజలంతో అభిషేకం చేసి పుష్పార్చన, నివేదన కార్యక్రమాలు చేపట్టారు. జ్వాలా వీరభద్రస్వామికి అభిషేకం జరిపించారు.

నందీశ్వరస్వామికి పరోక్ష సేవ

ఆలయ ప్రాంగణంలోని శనగన బసవన్నగా పేరు పొందిన నందీశ్వరునికి అర్చకులు పూజలు నిర్వహించారు. 21 మంది భక్తులు పరోక్షసేవగా నందీశ్వరస్వామికి విశేష పూజను జరిపించుకున్నారు.

పారదర్శకంగా ఉపాధి పనులు



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీడీ సాంబశివరావు

ఉయ్యాలవాడ: జాతీయ ఉపాధి హామీ పథకంలో ఎలాంటి అవకతవకలకు అవకాశం లేకుండా ఉపాధి పనులు చేపట్టాలని ఏపీడీ సాంబశివరావు అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో దొర్నిపాడు, ఉయ్యాలవాడ మండలాలకు చెందిన టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఉపాధిలో కూలీల మస్టర్లు నమోదు, పనుల గుర్తింపు, 7 రికార్డుల నమోదు వంటి కార్యక్రమాలు ఇక మీదట ఎన్ఎమ్ఎమ్ఎస్ యాప్ ద్వారానే నమోదు చేయాలన్నారు. పని ప్రదేశాల్లో తప్పనిసరిగా ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లు జియోట్యాగింగ్ చేయవలసి ఉంటుందన్నారు. పని ప్రదేశంలో చేపట్టిన పనుల పేరు, వ్యయంతో కూడిన నేమ్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్సార్పీ శ్రీనివాసులు, కోర్స్ డైరెక్టర్ ఏసుదాసు, ప్లాంటేషన్ సూపర్‌వైజర్ రషీద్‌బాషా, ఏపీఓలు పాల్గొన్నారు.

అధికారులపై రైతుల కన్నెర్ర

- అరకొర యూరియా ఇవ్వడంపై వాగ్వాదం
- పోలీసు బందోబస్త్ మధ్య పంపిణీ



రైతులను నిలువరిస్తున్న ఏఎస్‌ఐ సుబ్బారావు



పీర్‌సాహెబ్‌పేట రైతు సేవా కేంద్రం వద్ద రోడ్డుపై పడిగాపులు కాస్తున్న రైతులు

పగిడ్యాల: యూరియా కొరతతో అల్లాడిపోతున్న అన్నదాత బుధవారం వ్యవసాయ అధికారులపై కన్నెర్ర చేశారు. రైతు సేవా కేంద్రాలు, ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల వద్ద పోలీసు బందోబస్తు మధ్య చేపట్టిన యూరియా పంపిణీ గందరగోళంగా మారింది. పట్టదారు పాస్‌పుస్తకాల జిరాక్స్‌లను క్యూలో పెట్టి ఆరుబయట ఎండలో గంటల కొద్దీ పడిగాపులు కాసినా.. మూడు బస్తాల కంటే ఎక్కువ ఇవ్వకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. లక్ష్మాపురం ప్రాథమిక సహకార సొసైటీ కార్యాలయంలోకి చొరబడడానికి యత్నించిన రైతులను పోలీసులు అడ్డుకున్నారు. పగిడ్యాల సొసైటీ వద్ద కూడా రైతులు యూరియా కోసం గంటల తరబడి నిరీక్షించారు.

నందికొట్కూరు: మిడుతూరు మండలం పీర్‌సాహెబ్‌పేట రైతు సేవా కేంద్రం వద్ద యూరియా కోసం బుధవారం రైతులు పడిగాపులు కాశారు. మూడు గ్రామాలను కలిపి క్లస్టర్‌ను ఏర్పాటు చేయడంతో రైతులు ఎరువుల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎరువుల కోసం రైతులు ఉదయం పెద్ద ఎత్తున రైతు సేవా కేంద్రం వద్దకు తరలిరావడంతో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

రైతులు అంగీకరిస్తేనే సమస్యకు పరిష్కారం



ఉయ్యాలవాడలో ప్రధాన మురుగు కాలువను పరిశీలిస్తున్న డీపీఓ లలితాబాయ్

ఉయ్యాలవాడ : మధ్యలో నిలిచిపోయిన మురుగు కాలువ నిర్మాణం పనులు చేపట్టాలంటే రైతులు అంగీకరం అవసరమని జిల్లా పంచాయతీ అధికారిణి లలితాబాయ్ పేర్కొన్నారు. నెల రోజుల క్రితం గ్రామానికి చెందిన రైతులు గుండం శ్రీనివాసరెడ్డి, బాలిరెడ్డి, సుబ్బారెడ్డి, తొలిశన్న, మరి కొంత మంది రైతులు గ్రామంలోని మురుగు నీరంతా ప్రధాన కాలువ ద్వారా తమ పొలాల్లో ప్రవహిస్తుందని, దీంతో తాము పంటలు సాగు చేయలేకపోతున్నామని కలెక్టర్ రాజకుమారి గణియాకు ఇటీవల ఫిర్యాదు చేశారు. ఆమె ఆదేశాల మేరకు డీపీఓ బుధవారం మండల కేంద్రం ఉయ్యాలవాడకు వచ్చి మురికి కాలువను పరిశీలించారు. సమస్యపై పూర్తి స్థాయిలో బాధిత రైతులు, అధికారులు, గ్రామ పెద్దలతో రెండు గంటల పాటు చర్చించారు. గత ప్రభుత్వం సమస్య పరిష్కారం కోసం డ్రైనేజీ నిర్మాణానికి చర్యలు తీసుకుందని, అయితే, అయితే కాలువ పరిధిలో ఉన్న రైతు ఎగ్గోని వెంకటరెడ్డి హైకోర్టుకు వెళ్లడంతో పనులు చేపట్టలేకపోయామని మండల అధికారులు వెల్లడించారు. దీనిపై డీపీఓ మాట్లాడుతూ కాలువపై ఉన్న రైతులందరూ సమ్మతిస్తూ రాత పూర్వకంగా తెలియజేస్తే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఇందుకు గ్రామ పెద్దలు బోరెడ్డి నర్సిరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి త్వరలో కాలువ పరిధిలోని రైతులందరితో గ్రామ సభ ఏర్పాటు చేసి తీర్మానం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, ఈఓపీఆర్‌డీ నాగలక్ష్మమ్మ పాల్గొన్నారు.

తల్లి పాలు బిడ్డకు శ్రేయస్కరం



సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీఓ తేజస్విని



గోస్పాడులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఉయ్యాలవాడ: పుట్టిన పిల్లలకు తల్లి పాలు తాపడం శ్రేయస్కరమని ఐసీడీఎస్ సీడీపీఓ తేజస్విని సూచించారు. బుధవారం స్థానిక 4వ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లి పాల వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లి పాలు బిడ్డకు అమృతం లాంటివన్నారు. తల్లి పాల పై తల్లులకు అవగాహన కల్పించవలసిన బాధ్యత అంగన్‌వాడీ కార్యకర్తలు, ప్రాథమిక ఆరోగ్య సిబ్బందిపై ఉందన్నారు. తల్లి పాలతో బిడ్డకు రోగ నిరోధక శక్తి మెరుగు పడుతుందన్నారు. ఇలా పాలు తాపించడం వల్ల తల్లికి రొమ్ము, గర్భాశయ క్యాన్సర్, మధుమేహం, తదితర రోగాలు రాకుండా ఉంటాయన్నారు. బిడ్డకు ఆరు మాసాలు వచ్చే వరకు తల్లి పాలే తాపించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ప్రభాకరమ్మ, మండలంలోన్ని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు ఔషధం

గోస్పాడు: తల్లిపాలే బిడ్డకు ఆరోగ్యాన్ని పెంచే ఔషధం అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి అన్నారు. బుధవారం గోస్పాడు మండలంలోని దీబగుంట్ల అంగన్‌వాడీ కేంద్రం–1లో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిపాల వల్ల కలిగే ప్రయోజనాలు, పోతపాలు వల్ల వచ్చే జబ్బులు, నష్టాల గురించి తల్లులకు తెలియజేశారు. పుట్టిన గంటలోపే బిడ్డకు ముర్రుపాలు పట్టించాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య,ఆశావర్కర్లు,అంగన్‌వాడీటీచర్లు పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ



రుద్రవరంలో విచారణ చేపట్టిన అధికారులు

రుద్రవరం: రుద్రవరం మేజర్ పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై విచారణ చేపట్టినట్లు నంద్యాల డీపీఓ లలితాబాయ్ తెలిపారు. స్థానిక మేజర్ పంచాయతీకి సంబంధించి వివిధ రకాల నిధులు దాదాపు రూ.2.14కోట్లు దుర్వినియోగమైనట్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదులందాయి. దీనిపై విచారణకు వచ్చిన డీపీఓ కార్యాలయంలో రికార్డులు పరిశీలించి మాట్లాడారు. మేజర్ పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదులు అందగానే పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేశామన్నారు. అలాగే సర్పంచ్‌కు షోకాజ్ నోటీస్ జారీ చేసి చెక్ పవర్ రద్దు చేసి ఎంపీడీఓ భాగ్యలక్ష్మికి అప్పగించినట్లు తెలిపారు. ఆ నిధుల అవకతవకలపై పూర్తి స్థాయిలో విచారణ చేసేందుకు జిల్లా కలెక్టర్ ప్రత్యేక కమిటీని నియమించినట్లు ఆమె తెలిపారు. ఈ కమిటీలో తనతో పాటు జిల్లా ఆడిట్ అధికారి, సీనియర్ ఆడిటర్లు మహేశ్వరరెడ్డి, రాఘవేంద్ర, డిప్యూటీ ఎంపీడీఓ బాలాంజనేయులు, పంచాయతీ కార్యదర్శి అశ్విన్ కుమార్, అలాగే డీపీఓ కార్యాలయం నుంచి ఇతర సిబ్బంది సభ్యులుగా ఉంటారని తెలిపారు. 10 పని దినాల గడువులో గత నాలుగు సంవత్సరాలకు సంబంధించిన రికార్డులన్నింటినీ పరిశీలించి నివేదిక ఇస్తామన్నారు. నిధుల దుర్వినియోగం నిజమని తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం పదిలం



పంచాయతీ సిబ్బందితో మాట్లాడుతున్న సీఈఓ నాసరరెడ్డి

- జిల్లా పరిషత్ సీఈఓ నాసరరెడ్డి

ఓర్వకల్లు: పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే ఆరోగ్యాలు పదిలంగా ఉంటాయని జిల్లా పరిషత్ సీఈఓ నాసరరెడ్డి తెలిపారు. స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్‌లో భాగంగా బుధవారం మండలంలోని నన్నూరు గ్రామాన్ని సీఈఓతో పాటు, డీపీఓ భాస్కర్, ఎంపీడీఓ శ్రీనివాసులు వేర్వేరుగా సందర్శించారు. ముందుగా తాగునీటి ట్యాంకులను పరిశీలించారు. అనంతరం వీధులను తనిఖీ చేసి, ఇంటింటికి తిరిగి చెత్త సేకరణ ట్రాక్టర్ వస్తుందా? లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీఈఓ నాసరరెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో ఎప్పటికప్పుడు చెత్తను సేకరించి, వాటిలో తడి, పొడి చెత్తలను వేరుచేసి ఊరు బయట వున్న చెత్త సంపద కేంద్రాలకు తరలించాలని సూచించారు. చెత్త సేకరణపై ప్రభుత్వం ఐవీఆర్ఎస్ ఫోన్ కాల్స్ ద్వారా గ్రామ సమాచారాన్ని కోరినప్పుడు, ఏవిధంగా సమాధానం ఇవ్వాలని అవగాహన కల్పించారు. అలాగే గ్రామంలోని మురుగు కాల్వలను శుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. తాగునీటి ట్యాంకులను నిర్దేశించిన తేదీలలో శుభ్రం చేసి, క్లోరినేషన్ తేదీలను పరిశీలించాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి షేక్ బసిరున్నీషా, గ్రీన్ అంబాసిడర్లు, స్థానిక నాయకులు విజయుడు, ఖాజామియా, శంషుద్దీన్, కటిక హసన్ పాల్గొన్నారు.